ప్రజల కష్టాలు కనిపించవా!

- మురికి కాలువల్లో నీటి పైపులు..
- పలు ప్రాంతాల్లో కలుషిత నీటి సరఫరా
- ప్రబలుతున్న డయేరియా



బద్వేలు అర్బన్‌: మైదుకూరురోడ్డులో మురుగునీటిలో తాగునీటి పైపులైను



ప్రొద్దుటూరు : ఆంధ్రకేసరి రోడ్డులో హాస్టల్‌ వద్ద పైపులైన్‌ లీకేజీ

ప్రొద్దుటూరు : అధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారుతోంది. అసలే వర్షాకాలం కావడం.. ఆపై తాగునీరు కలుషితం కావడంతో డయేరియా వ్యాధి క్రమేణా ప్రబలుతోంది. పట్టణాలు, గ్రామాలు అన్న తేడా లేకుండా వ్యాధి విస్తరిస్తోంది. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో అనేక చోట్ల పైపులైన్‌ లీకేజీలు ఉన్నాయి. కొన్ని చోట్ల మురికి కాలువల మీదే పైపులైన్‌లు దర్శనమిస్తున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో 234 కిలోమీటర్ల పైపులైన్‌ ద్వారా 24వేల కొళాయి కనెక్షన్లకు రోజు నీరు సరఫరా అవుతోంది. తరచూ పలు చోట్ల పైపులైన్‌ లీకేజీలు కావడం, అధికారులు మరమ్మతులు చేయడం పరిపాటిగా మారింది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పట్టణంలో పైపులైన్‌ లీకేజీ లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయంపై మున్సిపల్‌ ఏఈ దస్తగిరి రెడ్డిని వివరణ కోరగా ఎప్పటికప్పుడు పైపులైన్‌ మరమ్మతులను చేయిస్తున్నామని తెలిపారు. మెయిన్‌రోడ్లపై ఉన్న లీకేజీలకు సంబంధించి ఆర్‌అండ్‌బీ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉందన్నారు.

వెంటాడుతున్న కలుషిత నీటి భయం

బద్వేలు అర్బన్‌: బద్వేలు పట్టణంతో పాటు గ్రామాల్లో ప్రజలను కలుషిత నీటి భయం వెంటాడుతోంది. పట్టణంలో నిర్వహణ లోపం, గ్రామాల్లో నిధుల లేమితో ట్యాంకులను శుభ్రపరచకపోవడం వంటి కారణాలతో నీరు కలుషితమై ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు.

మున్సిపాలిటీలో.. పట్టణంలోని 35 వార్డుల్లో 72 వేలలకు పైగా జనాభా నివసిస్తున్నారు. పట్టణ ప్రజల తాగునీటి అవసరాల కోసం రూ.110 కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులతో బృహత్తర తాగునీటి పథకం ద్వారా బ్రహ్మంసాగర్‌ నుంచి పైప్‌లైన్‌ వేసి పట్టణంలోని 9 భూ ఉపరితల జలాశయాలకు నీటిని నింపి ప్రజలకు శుద్ధనీరు అందించాలన్న ఉద్దేశ్యంతో 2013లో పథకాన్ని ప్రారంభించారు. 2018లో పథకం అమల్లోకి వచ్చింది. పట్టణంలోని అన్ని వార్డుల్లో సుమారు 185 కిలోమీటర్ల మేర డిస్ట్రిబ్యూటరీ పైపులైను ద్వారా 85 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే పథకం పనులు జరిగే సమయంలో అప్పటి అధికారులు, కాంట్రాక్టర్‌ నిర్లక్ష్యం కారణంగా చాలా ప్రాంతాల్లో పైపులైను డ్రైనేజీ కాలువలకు సమీపంలో వేయడంతో పాటు కొళాయి కనెక్షన్లు కూడా ఇష్టానుసారంగా డ్రైనేజీల వద్ద నుంచే ఇచ్చారు. అంతేకాకుండా పట్టణంలో తరచూ పైపులైన్లు లీకేజీ కావడంతో నీరు కలుషితమవుతోంది. స్థానిక మైదుకూరు రోడ్డు, సిద్దవటం రోడ్డులలో ప్రధాన డిస్ట్రిబ్యూటరీ పైపులైను డ్రైనేజీ కాలువల్లో ఉండటంతో కొన్ని ప్రాంతాల్లో దుర్వాసనతో కూడిన నీరు వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

రూరల్‌ పరిధిలో.. మండల పరిధిలోని పది గ్రామ పంచాయతీల్లో సుమారు 27 వేల పైచిలుకు జనాభా నివసిస్తున్నారు. ఆయా పంచాయతీల్లోని పలు గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్‌ ఆధ్వర్యంలో డైరెక్టు పంపింగ్‌ స్కీం, భూ ఉపరితల ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. ప్రధానంగా పంచాయతీలకు నిధులు లేని కారణంగా ట్యాంకులు శుభ్రతకు నోచుకోవడం లేదు. అంతేకాకుండా ఎప్పుడో దశాబ్దాల క్రితం వేసిన పైపులైన్లు పలు ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరుకోవడంతో తరచూ మరమ్మతులకు గురవుతూ ఉన్నాయి.

అధికారులు పైపులైన్‌ మరమ్మతులు చేపట్టాలి



మున్సిపల్‌ అధికారులు పరిశీలించి వెంటనే పైపులైన్‌ మరమ్మతులను చేపట్టాలి. చాలా రోజులుగా పెద్దగుంత మెయిన్‌ రోడ్డులో లీకేజీ ఏర్పడింది. రోజు నీటి సరఫరా సమయంలో నీరు రోడ్డుపైకి వస్తోంది.

\- యమ్మనూరు ఆంజనేయులు, తెలుగు యువత జిల్లా కార్యదర్శి, ప్రొద్దుటూరు

వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది



సంజీవనగర్‌, స్వరాజ్యనగర్‌ ప్రాంతాల్లో ఎక్కువ మంది నిరుపేదలే ఉన్నారు. పైపులైన్‌ లీకేజీల వలన నీరు కలుషితమై ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. వెంటనే అధికారులు మరమ్మతులు చేట్టాలి.

\- ఓబులేసు, ప్రొద్దుటూరు

క్లుప్తంగా

మాయాబజార్‌ స్టూడియో ప్రారంభం



స్టూడియోను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు కల్చరల్‌ : స్థానిక కొర్రపాడు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన మాయాబజార్‌ స్టూడియోను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టూడియో యాజమానులు ఖాదర్‌బాషా, మస్తాన్‌వలి, ఖాజాహుస్సేన్‌ మాట్లాడుతూ ప్రీ వెడ్డింగ్‌ షూట్‌, ఫొటోషూట్‌కు అవసరమయ్యే విధంగా స్టూడియోను రూపొందించామన్నారు. టీడీపీ నాయకులు ముక్తియార్‌, సీఎం సురేష్‌నాయుడు, రోటరీక్లబ్‌ అధ్యక్షుడు బాల సూర్యారావు, బద్రిపల్లెస్వామి పాల్గొన్నారు.

సీమ సమస్యలపై చర్చించాలి

ప్రొద్దుటూరు: రాయలసీమ సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తాలని ప్రొద్దుటూరు, మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యేలు నంద్యాల వరదరాజులరెడ్డి, పుట్టా సుధాకర్‌ యాదవ్‌లకు శనివారం రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకులు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం నుంచి ప్రారంభమవుతున్న అసెంబ్లీ సమావేశాల్లో సీమ సమస్యలు పరిష్కరమయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఎమ్మెల్యేలను కలిసిన వారిలో విరసం నాయకురాలు వరలక్ష్మి, రాయలసీమ విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్‌ మహమూద్‌, చైతన్య మహిళా సంఘం నాయకురాలు పద్మ, ప్రజా నాట్యమండలి గాయకుడు రమణ ఉన్నారు.

నేడు భగవద్గీత పారాయణం

ప్రొద్దుటూరు : గురుపౌర్ణమి మహోత్సవాన్ని పురస్కరించుకుని కడప నగరంలోని ఆకులవీధిలో ఉన్న శ్రీరాజరాజేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం ఉదయం, సాయంత్రం 7 నుంచి 8 గంటల వరకు భగవద్గీత పారాయణం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రొద్దుటూరుకు చెందిన శివదర్శనానందన సరస్వతీమాతాజీ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ప్రొద్దుటూరు శాస్త్రీనగర్‌లోని ఆశ్రమంలో ఉదయం 10.30 నుంచి 12 గంటల వరకు గురుపౌర్ణమి మహోత్సవం కార్యక్రమం నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు.

రక్తదానం

పోరుమామిళ్ళ (అట్లూరు) : ఆపదలో ఉన్న మహిళకు ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి యువసేన యువకుడు రక్తదానం చేశాడు. పోరుమామిళ్ల పట్టణంలోని వెంకటేశ్వర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పట్టణానికి చెందిన రసూల్‌బీ అనే మహిళకు బీ పాజిటివ్‌ రక్తం అవసరమైంది. డీసీ యువసేన అధ్యక్షులు సాయినారాయణరెడ్డి ఆధ్వర్యంలో మెకానిక్‌ సుభాన్‌ అనే యువకుడు రక్తదానం చేయడం చేశాడు.

కూల్‌ వాటర్‌ క్యాన్లు పంపిణీ



డ్వాక్రా మహిళలకు కూల్‌ వాటర్‌ క్యాన్‌ అందిస్తున్న బ్యాంక్‌ ఆఫ్‌ బరోడా బ్యాంక్‌ అధికారులు

ప్రొద్దుటూరు : బ్యాంక్‌ ఆఫ్‌ బరోడా వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక హోమస్‌ పేట బ్రాంచి బ్యాంకు అధికారులు డ్వాక్రా మహిళలకు 93 కూల్‌ వాటర్‌ క్యాన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బ్రాంచి మేనేజర్లు యూజీ శ్రీకాంత్‌, రామోజీ ధైర్యం కేక్‌ కట్‌ చేసి వేడుకలను నిర్వహించుకున్నారు. మహిళా శక్తి భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో మెప్మా టీఈ కెజియా జాస్లీన్‌, మహిళలు పాల్గొన్నారు.

సరుకులు వితరణ

బద్వేలు అర్బన్‌ : స్థానిక తెలుగుగంగ కాలనీలోని నిరాశ్రయుల వసతిగృహానికి శనివారం బ్యాంక్‌ ఆఫ్‌ బరోడా ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర సరుకులు వితరణగా అందించారు. ఈ సందర్భంగా బ్యాంక్‌ మేనేజర్‌ శ్రీధర్‌నాథ్‌ మాట్లాడుతూ బ్యాంక్‌ ఆఫ్‌ బరోడా వార్షికోత్సవం సందర్భంగా ఆశ్రమానికి నిత్యావసర సరుకులు అందించామని తెలిపారు. బ్యాంక్‌ సిబ్బంది బాష, సుబ్బారెడ్డి, ఆశ్రమ నిర్వాహకులు రవికుమార్‌పాల్గొన్నారు.

22 నుంచి టెట్‌ తరగతులు

ప్రొద్దుటూరు కల్చరల్‌ : స్థానిక నందిని క్లాత్‌మార్కెట్‌లోని జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో ఈ నెల 22 నుంచి జేవీవీ ఆధ్వర్యంలో టెట్‌, డీఎస్సీ తెలుగు తరగతులు నిర్వహించనున్నట్లు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి సురేష్‌ తెలిపారు. శనివారం జేవీవీ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. పూర్తి వివరాలకు 97054 32038 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

తహసీల్దారుకు సన్మానం

పోరుమామిళ్ల (అట్లూరు) : పోరుమామిళ్ల తహసీల్దారు శిరీషకు కార్యాలయ సిబ్బంది శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఎన్నికల విధుల్లో భాగంగా చిత్తూరు జిల్లా నుంచి వచ్చిన తహసీల్దారు శిరీష ప్రభుత్వ ఆదేశాల మేరకు సొంత జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ సిబ్బంది ఆర్‌ఐ సుధాకర్‌రెడ్డి, వీఆర్‌ఓలు రామలక్షుమ్మ, సుబ్రమణ్యం, వీఆర్‌ఏలు ఘనంగా సన్మానించారు.

అల్లాడుపల్లెలో ప్రత్యేక పారిశుధ్య పనులు



పరిశుభ్రం చేసిన హెడ్‌ ఓవర్‌ హెడ్‌ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

చాపాడు : మండల పరిధిలోని అల్లాడుపల్లె గ్రామంలో నాలుగు రోజులుగా డయేరియా కేసులు నమోదు కావడంతో గ్రామంలో పంచాయతీ అధికారులు ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని అన్ని డ్రైనేజీ కాలువల్లో వ్యర్థ పదార్థాలను తొలగించారు. మురికి గుంతల్లో బ్లీచింగ్‌ పౌడర్‌ చల్లించారు. మంచినీటి పథకం, ఆరోగ్య ఉప కేంద్రం చుట్టు ప్రదేశాల్లో పిచ్చి మొక్కలను తొలగించారు. దేవళాలు వద్ద ఉన్న మంచినీటి పథకాన్ని శుభ్రం చేయించారు. సర్పంచ్‌ జీఎం కిశోర్‌ కుమార్‌రెడ్డి సహకారంతో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

నీటి పరీక్షల్లో బ్యాక్టీరియా లేదని నిర్ధారణ

అల్లాడుపల్లె పంచాయతీ ఆధ్వర్యంలో సరఫరా చేసే తాగునీటిలో ఎలాంటి బ్యాక్టీరియా నిర్ధారణ కాలేదని ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి



విద్యార్థులకు పుస్తకాలు అందచేస్తున్న మాదాసు మురళీ

ప్రొద్దుటూరు కల్చరల్‌ : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని రాష్ట్ర సగర జేఏసీ చైర్మన్‌ మాదాసు మురళీ పేర్కొన్నారు. మండల పరిధి చెన్నమరాజుపల్లె మండల పరిషత్‌ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం జిల్లా సగర సంఘం ఆధ్వర్యంలో వ్యాపార వేత్త వర్రా మధుసూదన్‌ రావు సహకారంతో పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయిలో నిలిచి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు యోగానంద, జిల్లా సగర సంఘం వైస్‌ప్రెసిడెంట్‌ వరికూటి సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌, తాలుకా సగర సంఘ ప్రెసిడెంట్‌ నశ్యం వెంకటసుబ్బయ్య, వరికూటి నాగన్న పాల్గొన్నారు.

కుష్టుపై అవగాహన కలిగి ఉండాలి

దువ్వూరు : కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్‌ సురేష్‌బాబు, డాక్టర్‌ రోహిణి తెలిపారు. జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా దువ్వూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుంచి సెంటర్‌ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ ఈనెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంపై ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తారని తెలిపారు. హెల్త్‌ సూపర్‌వైజర్లు రాజగోపాల్‌, సువర్ణ పాల్గొన్నారు.

రైతులు నూతన పద్ధతులు పాటించాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ

అట్లూరు: రైతులను కాలానుగుణంగా వినూత్న పద్ధతుల ద్వారా పంటలు సాగు చేసుకునేలా చర్యలు చేపట్టాలని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ తెలిపారు. శనివారం వ్యవసాయ డివిజన్‌ కార్యాలయంలో బద్వేలు, గోపవరం, సిద్దవటం, అట్లూరు మండలాల వ్యవసాయాధికారులు, రైతు సేవా కేంద్రాల సహాయకులతో శిక్షణతో కూడిన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఖరీఫ్‌ సీజన్‌లో రైతులు ఉత్తమ యాజమాన్య పద్ధతులు చైతన్యపరిచి ఈ–క్రాప్‌ మోడల్‌ అభివృద్ధి చేయాలని, ప్రతివారం రైతుసేవా కేంద్రాల వారీగా నమోదైన వర్షపాతం, పంటల వారీగా సాగైన విస్తీర్ణం నివేదికలతో ఖచ్చితత్వంతో అందజేయాలన్నారు. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని గణనీయంగా తగ్గించి సేంద్రియ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. అలాగే ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటలు, ఉద్యాన పంటల సాగు, ప్రభుత్వ ప్రోత్సాహంపై వివరించారు. ఈ నెల 23 నుంచి పొలం పిలుస్తుంది కార్యక్రమం ఉంటుందన్నారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారులు చంద్రమోహన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, రామకృష్ణయ్య, అగ్రిల్యాబ్‌ వ్యవసాయాధికారి మాధురి పాల్గొన్నారు.

పోలీసుల వినూత్న ప్రయత్నం



బహిరంగంగా మద్యం తాగే ప్రాంతాల్లో పరిసరాలను శుభ్రం చేయిస్తున్న అర్బన్‌ సీఐ

బద్వేలు అర్బన్‌ : బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే చర్యలను నియంత్రించడానికి బద్వేలు అర్బన్‌ పోలీసులు చేసిన వినూత్న ప్రయత్నం చేశారు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రతిరోజు సాయంత్రం వేళల్లో కొందరు మందుబాబులు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతుంటారు. ఈ సమయంలో సాధారణ ప్రజలు ఇబ్బందులు పడటం, మందుబాబులు ఘర్షణకు దిగి శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నం కావడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో పోలీసులు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిని గుర్తించి జరిమానాలు సైతం విధిస్తున్నారు. అయినా మార్పు కనిపించకపోవడంతో పోలీసులు వినూత్న ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో మున్సిపల్‌ సిబ్బంది, పోలీసు సిబ్బంది, మహిళా సంరక్షణ కార్యదర్శులు, ప్రజలతో కలిసి ఎక్కడైతే అధికంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్నారో ఆ ప్రాంతాలను శుభ్రం చేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అర్బన్‌ సీఐ యుగంధర్‌ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం వలన కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వారిలో మార్పు తీసుకువచ్చేందుకే ఈ వినూత్న కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అర్బన్‌ ఎస్‌ఐ సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ లక్ష్మీనారాయణ, పోలీసు, మున్సిపల్‌ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బాల్యం నుంచే విలువలు నేర్పించాలి

రాజుపాళెం : విద్యార్థులకు సంస్కృతి సాంప్రదాయాలనే విలువలను బాల్యంలోనే నేర్పించాలని ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్‌ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌ రాజు, ప్రొద్దుటూరు డీఎస్పీ మురళీధర్‌ ఆదేశాల మేరకు మండలంలోని పగిడాల గ్రామంలోని మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులు, తల్లిదండ్రులకు ఎస్‌ఐ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మంచి మార్గంలో నడిచేందుకు అవగాహన కల్పించాలని, పిల్లల భవిష్యత్తుకు తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమైందని తెలిపారు. అనంతరం ఎస్‌ఐ అడిగిన ప్రశ్నలకు మంచి జవాబులు ఇచ్చిన చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులతో పాటు మిఠాయిలను పంచి పెట్టారు. ఉపాధ్యాయుడు బాంధవ రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్త భాగ్యమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా సాయినాథుని గ్రామోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్‌ : దొరసానిపల్లెలోని శ్రీ షిర్డీసాయిబాబా ఆలంయలో గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సాయిబాబా ఉత్సవ మూర్తిని గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక వసంతపేటలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు అలంకరణతో పాటు మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని సాయిసేవాసంఘం నిర్వాహకురాలు వరలక్ష్మి తెలిపారు. పట్టణంలోని వైఎంఆర్‌ కాలనీ, వసంతపేట, దొరసానిపల్లెలోని సాయాబాబా ఆలయాలను వేడుకలకు సిద్ధం చేశారు.

24న ఆలయ భూముల వేలం

రాజుపాళెం : కొర్రపాడు గ్రామంలోని శ్రీచెన్నకేశవ, ఈశ్వర దేవస్థానాలకు సంబంధించిన భూములను 24వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు కౌలుకు వేలంపాట వేయనున్నట్లు ఆలయ ఈఓ కె.రామచంద్రాచార్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలంపాట ప్రొద్దుటూరులోని నారాయణ రంగయ్య గారి సత్రంలో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మొత్తం 21.46 ఎకరాల భూములకు వేలంపాట జరగనుందని, ఈ వేలంలో పాల్గొనే పాటదారులంతా రూ.5 వేలు డిపాజిట్‌ చెల్లించాలని చెప్పారు.

ముగిసిన మొహరం

రాజుపాళెం : మండలంలోని గాదెగూడూరు గ్రామంలో వారం రోజుల పాటు జరిగిన మొహరం వేడుకలు శనివారం భక్తిశ్రద్ధలతో ముగిశాయి. తెల్లవారుజామున 1 గంట నుంచి గ్రామంలో ఊరేగించారు. ముందుగా పీర్ల చావిడి వద్ద మౌళాళి స్వామి పీరును ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఊరేగించారు. బంధువుల రాకతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

మెరుగైన వైద్యం అందించాలి



వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌ యాదవ్‌

మైదుకూరు : ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌ యాదవ్‌ అన్నారు. శనివారం ఆయన మైదుకూరులోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్‌ కరీముల్లా, పలు విభాగాల వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్న పిల్లలు, గర్భిణులకు ప్రత్యేక శ్రద్ధతో వైద్యం అందించాలని అన్నారు. ఆస్పత్రిలో ఎక్స్‌రే, జనరేటర్‌ సౌకర్యాలు లేవన్నారు. ఆస్పత్రిలో అన్ని సౌక్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.

ప్రత్యేక పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆషాఢమాసం మూడో శనివారం సందర్భంగా స్వామి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామి వారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు.